# హైటెక్ కాలనీ అభివృద్ధికి కృషి



మంచిర్యాలటౌన్: హైటెక్ కాలనీలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు
- పలు నిర్మాణాలకు భూమిపూజ

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 2: పట్టణంలోని హైటెక్‌కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. కాలనీలో రూ. 2.78 కోట్లతో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బీటీ రోడ్డు, డివైడర్ బ్యూటిఫికేషన్ పనులకు సోమవారం భూమిపూజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైటెక్‌కాలనీలో గతంలోనే చాలా పనులు చేసినప్పటికీ ఇంకా చేయాల్సి ఉందన్నారు. పార్కులు, లైటింగ్‌సిస్టం, ఓపెన్‌జిమ్, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు నిధులు కేటాయించామన్నారు. ఇక్కడ ప్రధానంగా డ్రైనేజీ సమస్య ఉందని తన దృష్టికి రాగా వెంటనే నిధులు మంజూరు చేసి డ్రైనేజీని నిర్మించాలని చూశామని, అయితే ఇక్కడే ఇల్లు నిర్మించుకున్న మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు దానిని అడ్డుకున్నాడని, ఈ విషయం కాలనీ వాసులందరికీ తెలుసు అని అన్నారు. అయినా వెనక్కి తగ్గకుండా పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, 29వ వార్డు కౌన్సిలరు చైతన్యరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సత్యపాల్‌రెడ్డి, తోట తిరుపతి, చంద్రశేఖర్ హండే, పోచమల్లు, హన్మంతరావు, డాక్టర్ కుమార్, బాలరాజు, అంజయ్య పాల్గొన్నారు.

### మున్సిపాలిటీ అన్ని విధాలా అభివృద్ధి

లక్షెట్టిపేట, అక్టోబర్ 2: లక్షెట్టిపేట మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు అన్నారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవలే సీఎం కేసీఆర్ లక్షెట్టిపేట మున్సిపాలిటీకి ప్రత్యేకంగా రూ. 25 కోట్ల నిధులు మంజూరు చేశారని, వాటితో నూతనంగా మహానంద టాకీస్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో రోడ్లుతో పాటు పలు పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, డీసీఎంఎస్ చైర్మర్ తిప్పని లింగన్న, కౌన్సిలర్లు చాతరాజు రాజన్న, ఓరుగంటి శ్రీకాంత్, సురేశ్ నాయక్, మెట్టు కల్యాణిరాజు, గడికొప్పుల ఉమాదేవి, గొడిసెల లక్ష్మి, రాందేని వెంకటేశ్, రాందేని సుజాత, పార్టీ పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్, నాయకుల అంకతి కిషన్, రాందేని తిరుపతి, గోల్కొండ సత్తయ్య, శంకరన్న, కట్ల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### వంతెన పనులకు భూమి పూజ

లక్షెట్టిపేట రూరల్, అక్టోబర్ 2: మండలంలోని చెల్లంపేట నుంచి చిన్నయ్య ఆలయానికి వెళ్లే దారిలోని వాగుపై సుమారు రూ. 60 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపడుతున్న బ్రిడ్జి పనులకు మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు నాయకులతో కలిసి సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఎన్నికల అనంతరం ఆలయ అభివృద్ధికి నివేదిక తయారు చేయాలని నాయకులకు సూచించారు. డీసీఎంఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, హన్మంత్‌పల్లి సర్పంచ్ జైనేని సుజాత, ఎంపీటీసీ కోన సరిత, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ మండల ప్రధాన కా ర్యదర్శి కేతిరెడ్డి అనిల్ రెడ్డి, నాయకులు దొత నర్స య్య, వెంకటేశ్, కాంద్రపు శంకరయ్య పాల్గొన్నారు.

### ఎంజేపీలో జిల్లా స్థాయి క్రీడలు ప్రారంభం

లక్షెట్టిపేట, అక్టోబర్ 2: స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని మంచి పేరు తీసుకురావాలన్నారు. మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ చాతరాజు రాజన్న, డీసీవో శ్రీధర్, ప్రిన్సిపాల్ గౌతం రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సునీత, పీడీ రాజేశ్, పీఈటీ కార్తీక్‌తో పాటు క్రీడాకారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### అండగా ఉంటా ఆశీర్వదించండి...

దండేపల్లి, అక్టోబర్2: నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటాను.. మరోసారి మీ ఆశీర్వాదం కావాలని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. మండలంలోని రాజుగూడ జీపీ పరిధిలోని జైతుగూడ, కుంటలగూడ, మాకులపేట జీపీ పరిధిలోని రాముగూడ, మేదరిపేట జీపీలోని పర్దాన్‌గూడ గిరిజన గ్రామాల్లో సోమవారం ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాలు, గిరిజన గూడేలను పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దే అన్నారు. అనంతరం జైతుగూడలో ఏర్పాటు చేసిన హైమాస్ట్‌లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బండారి మల్లేశ్, మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్, సర్పంచ్‌లు కళావతి, లచ్చుపటేల్, అత్తె రాజవ్వ, డాంక లక్ష్మణ్, ఉప సర్పంచ్‌లు పుట్టపాక తిరుపతి, బట్టు రాజయ్య, గోపాల్, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

# అభివృద్ధికి మోడల్ సీఎం కేసీఆర్

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం

బెల్లంపల్లి, అక్టోబర్ 2 : అభివృద్ధికి మోడల్ సీఎం కేసీఆర్ అని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో రూ. 55 లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ, మూడో వార్డులో రూ. 40 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ, 16వ వార్డులో రూ. 40 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ , 18వ వార్డులో రూ. 40లక్షల నిధులతో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్లు పత్తిపాక రేణుక, గోసిక రమేశ్, కొక్కెర చంద్రశేఖర్, ఆస్మా, నాయకులు కుంబాల రాజేశ్, దామెర కిరణ్, రవి పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

బెల్లంపల్లి మండల కాంగ్రెస్ యువ నాయకుడు చిలుముల సాయికుమార్ బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బెల్లంపల్లి, మండల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- కుట్టు మిషన్ల పంపిణీలో సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



కుట్టు మిషన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోనప్ప రమాదేవి దంపతులు, ఫౌండేషన్ ప్రతినిధులు

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, అక్టోబర్ 2 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కాపువాడలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సతీమణి రమాదేవితో కలిసి నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫౌండేషన్ వారు గతంలో కూడా సిర్పూర్ నియోజకవర్గంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని, పేద ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ సభ్యులు, జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, పట్టణాధ్యక్షుడు వీవీ ప్రసాద్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గాంధీజీకి ఘన నివాళి

ఆసిఫాబాద్, అక్టోబర్ 2 : జిల్లాకేంద్రంలో జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, నాయకులు హైమద్, గోపాల్, వెంకన్న, రవి, అశోక్, సుగుణాకర్, ప్రసాద్, విలాస్, అహ్మద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

### కలెక్టరేట్‌లో..

జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో బోర్కడే హేమంత్ అదనపు కలెక్టర్ దాసరి వేణు, కాగజ్‌నగర్ ఆర్డీవో రాజేశ్వర్‌తో కలిసి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అహింస, సత్యం ఆయుధాలతో పోరాడి దేశానికి స్వాతంత్రం రావడంలో గాంధీజీ కీలకపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి, జిల్లా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### మంచిర్యాల పట్టణంలో..

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 2: పట్టణంలోని గాంధీపార్కులో గల గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, కలెక్టర్ బదావత్ సంతోష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రభుత్వ అధికారులు కూడా నివాళులర్పించారు. గాంధీ విగ్రహంతో పాటు పక్కనే ఉన్న నెహ్రూ విగ్రహానికి సైతం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ తెలంగాణలో గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. అనంతరం కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని, ఇందుకోసం మనందరం ముందుకుసాగాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్, కౌన్సిలర్లు హరికృష్ణ, ప్రకాశ్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు రాకేశ్, గౌసొద్దీన్, కార్కూరి చంద్రమౌళి, ముఖేశ్, పానగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### అహింస, శాఖాహార ర్యాలీ

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా చేపట్టిన అహింస, శాఖాహార ర్యాలీలో ఎమ్మెల్యే దివాకర్‌రావు, కలెక్టర్ బదావత్ సంతోష్ పాల్గొన్నారు. అహింసావాదాన్ని ఆచరించాలని, వీలైనంతగా శాఖాహారాన్నే భుజించాలని వారు సూచించారు. కార్యక్రమంలో పిరమిడ్ సొసైటీ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మంచిర్యాలటౌన్ : మంచిర్యాలలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు, కలెక్టర్ బదావత్ సంతోష్



ఆసిఫాబాద్ : కలెక్టరేట్‌లో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ బోర్కడే హేమంత్, అదనపు కలెక్టర్, సిబ్బంది

# నేషనల్ వైల్డ్‌లైఫ్ వారోత్సవాలు షురూ..

జన్నారం, అక్టోబర్ 2 : నేషనల్ వైల్డ్‌లైఫ్ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండలకేంద్రంలో జన్నారం డివిజన్ అధికారి సిరిపురం మాధవరావు ఆధ్వర్యంలో డివిజన్ సిబ్బంది, విద్యార్థుల రేంజ్ కార్యాలయం నుంచి ప్రధాన రోడ్డుపై అటవీ శాఖ ఈఈసీ సెంటర్ వరకు ర్యాలీ తీశారు. అనంతరం ఈసీఈ సెంటర్ వైల్డ్‌లైఫ్‌ను అభివృద్ధి చేయడం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్ హఫీసొద్దీన్, పోచమల్లు, డీఆర్వోలు, సెక్షన్, బీట్ ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతలో మనమే నంబర్‌వన్

ఆసిఫాబాద్, అక్టోబర్ 2 : స్వచ్ఛతలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా నిలుస్తున్నదని జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. జిల్లాకేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా డ్రైనేజీలు, రోడ్లపై చెత్తను సోమవారం శుభ్రం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సారి జిల్లావ్యాప్తంగా 14 గ్రామ పంచాయతీలకు అవార్డులు రాగా, ఒక్క గ్రామ పంచాయతీకి రాష్ట్ర స్థాయిలో అవార్డు వచ్చిందన్నారు. పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనం, శ్మాశన వాటికలు, మరుగుదొడ్లు, డ్రైనేజీల నిర్మాణం ఇలా అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజలు కూడా స్వచ్ఛతలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ అలీబిన్ హైమద్, నాయకులు వెంకన్న, రవి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.